శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!

అనుభవ సేతువు-ఆనంద హేతువు


# గురుకృప

జన్మదిన సంచిక



శ్రీ సాయిని అవనిపై అవతరించిన అవతార పురుషునిగా భావిస్తాం. ఎందుకంటే దానికి తగినటువంటి లక్షణాలన్నీ ఆయనలో ఉన్నాయి. అయితే ఆయన మాత్రం "అనల్‌హక్" (నేనే భగవంతుడ్ని) అని ఎన్నడూ చెప్పలేదు, "యా దేహక్" (నిరంతరం భగవంతుని స్మరించే పేదను) అంటూ "అల్లామాలిక్" అని జపిస్తూ ఉండేవారు. తాను భగవంతుని బానిసననే చెబుతూ ఉంటారు. అవతార పురుషుడే అయినప్పటికీ శుద్ధ వర్ణాశ్రమ ధర్మాలన్నీ ఆచరణతో లోకరీతిలో వ్యవహరించాల్సిన యోగ్యమైన రీతిని చూపి, లోకానికి ఆదర్శప్రాయుడు అవుతారు. ఆయన తమను ఎవరితోనూ ఏవిధంగానూ పోల్చుకునేవారు కాదు. ఎవరినీ అలా చేయనిచ్చేవారు కాదు. ఎవరినీ ఆయన తిరస్కరించేవారుకాదు. ఎవరినీ తక్కువ చేయరు. ఎవరినీ కించపరచరు. చరాచర విశ్వమంతటిలో సర్వవ్యాపకంగా ఉన్న విశ్వంభరుణ్నే చూస్తున్న ఆయన అన్నింటినీ చాలా సాధారణంగా తలుస్తారు.

- సాయి సచ్ఛరిత్ర



సంపుటి : 12
# గురుకృప
సంచిక : 1



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

మది స్మరణీయం-హృది రమణీయం 4
- గురుకృప

శ్వేతాంబరునితో 'శ్వేత' అనుభవాలు 6
- శ్వేత

అమెరికాలోనూ అమరికలు 8
- సీతాంబరము

ఇహపర శ్రేయోదాయి... 10
- టి. విజయరామయ్య

విశ్వాసమే బలం - సాటివారికీ ఫలం 11
- బి. కృష్ణ

'సత్య' సంకలనాలు 14
-గురుకృప

ఇంకా మరికొన్ని లోపలి పేజీలలో...

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222

# మది స్మరణీయం-హృది రమణీయం



"గురువును తెలుసుకో! లేకపోతే ఎందుకు, పిడకలేరుకోవడానికి వచ్చినట్లా !" అంటూ శ్రీ సాయి చూపిన విశిష్ఠమైన 'సద్గురుపథమే' అసలు సిసలైన సాయిబాటగా స్వీకరించి, గురుచరణ కమలమే లక్ష్యంగా 'గురుకృప' పత్రిక ప్రారంభమయ్యి పదకొండు వసంతాలు పూర్తిచేసుకొని పన్నెండవ వసంతంలోనికి అడుగిడింది.

### గురుస్మరణమే మార్గం - గురుచరణమే లక్ష్యం

జరిగిన ఇన్ని వసంతాలు 'గురుకృప' చేసినదేమిటి? - 'సద్గురుస్మరణ'. శ్రీసాయి వంటి మహామహిమాన్వితుడు - 'గురువే దైవమని' కలిగించిన వివేకానికి - అభ్యాసం 'గురుకృప'. అయితే ఈ అభ్యాసం ఆనందంగా సాగిందంటే అందుకు శ్రీసాయి అనుగ్రహం అపారంగా ఉండడమే కారణం. సాయి మహరాజ్ మాటలే 'గురుకృప'కు శృతి, స్మృతులు. "ఏ సాధనలు గాని, ఆరు శాస్త్రములలో ప్రావీణ్యము గాని అవసరము లేదు. నీ గురువునందు ప్రేమ, విశ్వాసములనుంచుము. గురువే సర్వమును చేయువాడనియు, కర్తయనియు పూర్తిగా నమ్ముము. ఎవరయితే గురువు యొక్క మహిమను, గొప్పదనమును గ్రహించెదరో వారే ధన్యులు". ఇలా ఇన్ని వసంతాలు గురుకృప చేసింది కేవలం 'గురుస్మరణ' మాత్రమే - అలా సద్గురు చరణాల యందు ప్రేమను, విశ్వాసాన్ని పెంచుకునేందుకు సాగింది గురుమహిమాగానం మాత్రమే!

### సాయిభక్త అనుభవ సేతువు - పరిపూర్ణ జీవన హేతువు

గురుకృప పత్రిక ప్రారంభమయిన నాటి నుండి నేటి వరకు పంచుకున్నదేమిటి? ఇహంలో మన అవసరాలను సద్గురువు ఎలా తీర్చారన్నదే కదా! అవును. "భక్తులకు ఐహికంగానూ, ఆముష్మికంగానూ లాభం చేకూర్చడానికే మహాత్ములున్నది" అన్న బాబా వాక్కుకు ఈ అనుభవాలు సజీవ సాక్ష్యాలు. ఎందరో 'పిచ్చుక'లకు 'మిష'లుగా ఇవి ఆధారాలు. ఇంకా భక్తుల అనుభవాల గురించి, శ్రీ సుందరం చెట్టియార్ ఇలా అంటారు– "మహాసిద్ధ పురుషుడు ప్రదర్శించిన అద్భుత లీలలకు, భక్తులు తెలిపిన వివరాలే సాక్ష్యాధారాలు. అవి భక్తులు స్వయంగా అనుభవించి, తెలిపినవి కాబట్టి, పాఠకుల యొక్క అజ్ఞానాన్ని, అనుమానాల్ని పారద్రోలి, వారిలో భక్తి విశ్వాసాలు నింపుతాయి" అని. సద్గురు పథాన్ని, సద్గురు చరణాలను ఆశ్రయించుకొని తమ జీవితాలను పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్న గురుబంధువుల అనుభవాలనే సేతువు



(వారధి) – మరెందరో గురుబంధువుల ఆనందానికి హేతువు (కారణం) కాగలదని చరిత్ర తెలిపే సత్యం.

***పంచుకోవడమంటే పెంచుకోవడమే!***

ఇలా సద్గురుపథగాములు పంచుకుంటున్న అనుభవ సమాహారాలు, వారు ఆ సద్గురు మూర్తికి ఆనందంతో అర్పిస్తున్న సుమహారాలనడం అతిశయోక్తి కాదు. ఏ అర్హతలు చూడకుండా తమను తాముగా తల్లిలా ప్రేమించి, తండ్రిలా తమ వెన్నంటి ఉంటూ ఆచార్యులై తమ జీవితాలలో విలువలకు స్థానమిస్తూ, వెలుగుదివ్వె అవుతున్న సద్గురువుకు ప్రేమతో అర్పించే సుమాలు ఈ అనుభవాలు. “మీరు పొందిన ఆనందాన్ని పంచుకోండి – పంచుకుంటే ఆ ఆనందం ఇంకా పెంపొందుతుందంటూ” తామెరిగిన సద్గురు వాక్యాన్ని ఎందరో గురుబంధువులు ఆచరిస్తూ, ఆనంద జలధిలో, సద్గురు అనుగ్రహఒడిలో తన్మయులవుతున్నారు. దశాబ్ధకాలం క్రితం బుడి బుడి అడుగులతో సద్గురు పథంలో అనుభవాలను పంచుకున్న గురుబంధువులు, నేడు వారి చిన్నారుల(బిడ్డల) అనుభవాలను పంచుకోవాలని తపించడమే ఇందుకు తార్కాణం.

***ఆర్తులా? జిజ్ఞాసువులా?***

“నా భక్తులు అడిగినవన్నీ ఇస్తాను.నేనివ్వదలచినది వారడిగేంత వరకు” అంటూ సాయి ఇచ్చిన అభయం – ఈ రోజు ఎందరో గురుబంధువుల జీవితాల్లో సాకారమయ్యింది. ఆర్తిగా వారడిగిన అవసరాలకు తల్లిలాంటి వారి ప్రేమను, కరుణను వర్షించే సద్గురుమూర్తి యొక్క సర్వశక్తిమత్వాన్ని, అవ్యాజ ప్రేమ తత్త్వాన్ని అవగాహన చేసుకున్న ఎందరో గురుబంధువులు ఈనాడు ఇహపరశ్రేయోదాయకమైన ‘సాయిపథం’లో సద్గురు తత్త్వాన్ని, సద్గురుపథాన్ని విశ్లేషించుకోవాలని, అనన్యమైన శరణాగతి పథంలో పయనించాలని తహతహలాడుతున్నారు. ఆర్తునిగా ప్రారంభమయిన జీవిత గమనం క్రమంగా జిజ్ఞాసాపథానికి మారుతోందంటే అది కేవలం ‘గురుకృప’ మాత్రమే.

***ఎక్కడికి ఈ పయనం? ఏమిటి మన గమ్యం?***

“దేవుడే పుట్టితే సాయిరూపం...మనిషి దైవంగా పెరగడం బాబా మతం” ఇదిగో ఇది బాబా అనే పరిపూర్ణ సద్గురుతత్త్వం యొక్క స్వస్వరూపం. తండ్రికి తగ్గ బిడ్డల వలే మెలగుతూ, వేసే ప్రతి అడుగు సాయిపథంవైపుగా సాగుతోందా? లేదా? అని విశ్లేషించుకుంటూ సాగితే, సాయి మనవైపుగా వేస్తున్న అడుగులను ఎరుకలోనికి తెచ్చుకోగలం. ఈ భువిపై పరిపూర్ణ దైవత్వం – మానుష రూపేణా సంచరిస్తే అది శ్రీ సాయిబాబా, వారు చూపిన విశిష్ఠ మార్గం – సద్గురు పథం. కనుక సద్గురు పథంలో సూటిగా

పయనిస్తూ, మనిషి దైవ స్వరూపుడని ఎరుకలోనికి తెచ్చుకోవడమనే గమ్యాన్ని చేరేందుకు మనమూ ఒక్క అడుగు వేద్దాం – పది అడుగులు మనకై వేసే సద్గురు కరుణ మనకు స్ఫురణలో ఉంది కదా!



**విశేషాలు – విన్నపాలు**

**విజయదశమి విశేషాలను విన్న గురుబంధువులు, కన్నులతో గాంచి పులకించిన గురుబంధువులు – సాయి సాంప్రదాయానికి వైతాళికుడు, ఆచార వ్యవహారాల అజ్ఞానాన్ని పటాపంచలు చేయు జ్ఞానభాస్కరుడు, మూర్తీభవించిన సాయితత్త్వదర్శి, పశ్చిమాన ప్రభవించిన కరుణాదీప్తి, 'సాయినాథుని'కి మనందరిపై గల ప్రేమకు సాక్షి, తన అణువణువున, 'సాయి'నే నింపుకున్న 'సత్యకాముడు', సమున్నత వ్యక్తి, సదాచార్యుడు, సద్గురుదేవులు అయిన పూజ్యశ్రీబాబూజీని దర్శించి, శిరస్సు వంచి నమస్కరించి, సత్ప్రేమ సుమాలను సమర్పించుకున్నారు. జరిగిన విజయదశమి ఎందరో తల్లిదండ్రులకు ఒక మధురఘట్టం. మరెందరో వధూవరుల జీవితాలలో మరచిపోలేని మధురాతి మధురోత్సవం. బిడ్డల కళ్యాణం తల్లిదండ్రుల ఆకాంక్ష అయితే, శ్రీసాయినాథుని పాదముల చెంత, మహిమాన్వితులు శ్రీ బాబూజీ కరముల మీదుగా సాగిన కళ్యాణాలు వధూవరులు కన్న కల సాకారమైన వేళ. ఒక ప్రక్క 'ముగ్ధ'ల మనోహరం, మరోప్రక్క ముసిముసి నవ్వులతో వరుల ముఖాలు సుమనోహరం. నిరాడంబరంగా, అత్యంత వైభవంగా జరిగిన కళ్యాణాలను 'కన్నుల' పండుగగా గాంచిన గురుబంధువుల నుండి – వారి అనుభవాలను, హృది పలికిన భావాలను, మది పలికిన అనురాగాలను పంపమని విన్నపం చేస్తున్నాము. నూతన సంవత్సరంలో ప్రతీ గురుబంధువుకు సద్గురు దర్శన, వీక్షణ, భాషణాలు పరిపూర్ణంగా లభించాలని, వర్షించే అనుగ్రహాన్ని ఆస్వాదించే సంసిద్ధత సద్గురుమూర్తి ప్రసాదించాలని ఆకాంక్షిస్తోంది. ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది గురుకృప.**

# శ్వేతాంబరునితో 'శ్వేత' అనుభవాలు

సద్గురు దేవులు సాయినాథుని శరత్‌బాబూజీ పాద పద్మములకు నమస్కారములు చేసుకుంటూ, శ్రీ గురుదేవులు చేసిన లీలలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను. నా పేరు సాయిశ్వేత. నేను ఇంటర్ రెండవ సంవత్సరము చదువుతున్నాను. నేను 2001లో మా నాన్నగారి స్నేహితుడు విఠలయ్య అను గురుబంధువుగారి ద్వారా సత్సంగానికి పరిచయమయ్యాను. మొదట నేను తరచుగా సత్సంగానికి హాజరు అయ్యేదాన్ని కాదు. మా నాన్నగారు వెళ్లేవారు. వారి కారణంగా నేనుకూడా వెళ్లడం జరిగింది. అప్పటి



నుండి గురువుగారు, బాబాగారు, నా వెంటే ఉండి ఎలా కాపాడుతున్నారో తెలుపుకుంటున్నాను.

బాబా విగ్రహ ప్రతిష్ఠ చేయడానికి పరకాలకు గురువుగారు వచ్చినపుడు అదేరోజు నా జన్మదినం కావడం వల్ల నాకు గురువుగారి పాద దర్శనం చేసుకునే అవకాశం లభించింది. గురువుగారు స్టేజిపైకి వచ్చేటపుడు నేను గురువుగారికి ఈరోజు నా పుట్టినరోజు అని చెప్పినపుడు గురువుగారు నాకు ఒక పువ్వు (స్టేజికి అలంకరించినది) త్రుంచి ఇస్తూ నన్ను ఆశీర్వదించినపుడు నాకెంతో సంతోషం కలిగింది.

నేను పదవ తరగతి పరీక్ష వ్రాయడానికి వెళ్లినపుడు పరీక్ష హాలు బయట అందరి బ్యాగులు పెట్టేవాళ్లము. నా ప్రక్కనున్న బ్యాగ్ చైన్‌హుక్‌కు ఉన్న బాబాగారి లాకెట్ నా బ్యాగ్‌పైన పడి ఉండేది. నేను ఆ లాకెట్‌కు సమస్కరించుకునేదాన్ని. పరీక్ష ఆఖరిరోజున ఆ లాకెట్‌ను ముట్టుకొని వెనుకవైపున త్రిప్పి చూసినపుడు గురువుగారి ఫొటో కనబడింది. వారి అనుగ్రహంతో నేను పరీక్షలలో అత్యధిక మార్కులు తెచ్చుకొని ఉత్తీర్ణురాలినయ్యాను.

శిరిడీలో విజయదశమిరోజు గురువుగారు స్టేజి దర్శనము ఇవ్వడానికి వచ్చినపుడు స్టేజీ ఆవరణలో కూర్చోడానికి స్థలము దొరకనందున నేను బయటనే నిలబడవలసి వచ్చింది. అప్పుడు నాకు విపరీతంగా దాహం వేయడం వల్ల కళ్లు చీకట్లు కమ్మి పడిపోతానన్న ఫీలింగ్ కలిగి "గురువుగారూ! నాకు నీళ్లు కావాలి" అని మనసులో అనుకున్నాను. వెంటనే వెనుకనున్న ఒకావిడ వచ్చి నాకు నీళ్ల బాటిల్ అందించింది. ఇది గురువుగారే పంపించారని అనుకున్నాను.

మరియొక సంఘటన నేను పదవ తరగతి చదివేటపుడు ఒకరోజు మా హెడ్ మిస్ గారు నన్ను పిలిచారు. నేను స్కూల్‌కి హెడ్ గర్ల్ కావడం వల్ల రిమోట్ స్టార్టింగ్ శాటిలైట్ సెమినార్ క్విజ్ పోటీలో పాల్గొనడానికి మా క్లాసు నుండి నలుగురు అమ్మాయిలను ఎంపిక చేయమన్నారు. నేను నలుగురు అమ్మాయిలను ఎంపిక చేసాను. కాని మరునాడు పోటీకి వెళ్లే రోజున ఆ నలుగురులో ఒక అమ్మాయి రానందున ఆ అమ్మాయి స్థానంలో నన్ను వెళ్లమని మా హెడ్ మిస్ గారు చెప్పారు. మేము అక్కడకు వెళ్లేసరికి అక్కడ వక్తృత్వపోటీ కూడా ఉన్నదని మరియు ప్రతీ స్కూలు నుండి ఒకరు వచ్చి మాట్లాడాలని చెప్పారు. అప్పుడు మాతోనే వచ్చిన మా స్కూలు టీచర్ అరగంట ముందు ఆ అంశం గురించి శిక్షణ ఇచ్చారు. వేరే స్కూల్ వాళ్లు పూర్తిగా శిక్షణ తీసుకుని వచ్చారు. కాని మాకు ముందుగా ఎలాంటి సమాచారం

లేదు.అప్పుడు మా టీచర్‌గారు నన్ను వెళ్లి మాట్లాడమని చెప్పినపుడు నేను సరిగా ప్రిపేర్ కాకున్నా కూడా మనసులో గురువుగారిని స్మరించుకుని వెళ్లి ఆ పోటీలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అర్హత సంపాదించాను. ఇదంతా నాకు బాబా మరియు గురువుగారి ఆశీర్వాద ఫలితమేనని నేను తలచుకున్నాను.

–శ్వేత



# అమెరికాలోనూ అమరికలు

నేను ప్రస్తుతము డెట్రాయిట్‌లో మా అబ్బాయి దగ్గర ఉంటున్నాను. అమెరికాలో లాంగ్ వీకెండ్స్‌కి ఒక్కొక్క ప్లేస్‌లో సత్సంగము జరుగుతుంది. మే నెలలో వచ్చే లాంగ్ వీకెండ్స్ కొలరాడో స్ప్రింగ్స్‌లో జరుగుతుందని చెప్పారు. ఆ సత్సంగమునకు మా అబ్బాయి, కోడలు, మనవరాలు శ్రియా, నేను వెళ్లాలని నిర్ణయించుకున్నాము. మాతోపాటు గురుబంధువులు వాసు, దీప, లత, వాళ్ల బాబు కూడా వస్తామని అన్నారు. అందరం కలసి ఒకే ఫ్లైట్‌లో టికెట్లు తీసుకున్నాము. నాకు సత్సంగమునకు వెళ్లాలని చాలా కోరికగా ఉంది. కాని నా పరిస్థితి ఏమిటంటే నాకు ఈమధ్య ఆర్థ్రరైటిస్ వచ్చి నడవలేకపోతున్నాను. నేను మా అబ్బాయి ప్రవీణ్‌తో సత్సంగానికి వస్తానని చెప్పి తెగ ఉత్సాహపడిపోతున్నాను. తీరా అక్కడకు వెళ్లాక సత్సంగహాలుకు, రూముకు నడవగలనా అని అంటే, అప్పుడు ప్రవీణ్ "ఎందుకమ్మా అంత బాధపడతావు? గురువుగారికి ఉత్తరం వ్రాయి. అంతా ఆయనే చూసుకుంటారు." అన్నాడు. నేను గురువుగారికి ఉత్తరము వ్రాసుకున్నాను. ఏమని వ్రాసానంటే "గురువుగారూ నేను ఏమీ బాధపడకుండా సుఖంగా సత్సంగానికి వెళ్లిరావాలని" వ్రాసుకున్నాను. మే నెల వచ్చింది. మేమంతా 28వ తేదీన బయలుదేరి వెళ్లాము. వీల్ చైర్ ద్వారా నన్ను విమానము ఎక్కించారు. మేము డెన్వర్‌లో దిగాము. నన్ను వీల్ చైర్‌లో అమ్మాయి తీసుకువచ్చి బ్యాగేజ్ దగ్గర దింపి వీల్ చైర్‌ను తీసుకుని వెళ్లిపోయింది. మేము బయటకు వచ్చి కారు ఎక్కాలి. కాని ఇక్కడ కారు పార్కింగ్ దగ్గరకు వెళ్లాలంటే చాలా దూరముంది. అయినా కొంచెం పల్లంగా ఉంది. నిజంగా నేను నడవాలంటే కష్టమే. నన్ను, మా కోడలు రాణిని, పాపను బయట బెంచిమీద కూర్చోబెట్టి లగేజి తీసుకుని మిగతావాళ్లంతా పార్కింగ్ లాట్‌కు వెళ్లారు. మా కోసం గురుబంధువు రామ్మోహన్ వచ్చారు. ప్రవీణ్ లగేజ్ కారులో పెట్టి మాకోసం బయలుదేరుదామని అనుకుంటే అక్కడ విచిత్రంగా వీల్ చైర్ ఉందట. అది తీసుకుని మా దగ్గరకు వస్తే మేము ఆశ్చర్యంగా నీకు వీల్‌చైర్ ఎక్కడిది అంటే, "నీ కోసమే అన్నట్లు గురువుగారు కారు దగ్గర ఉంచారు" అని అన్నాడు. అప్పుడు ప్రవీణ్ వీల్‌చైర్‌లో నన్ను తీసుకొని



వచ్చి కారు దగ్గర దింపాడు. మేము బయలుదేరి కొలరాడో వెళ్లాము. అక్కడ మాకు రూమ్స్ ఇచ్చారు. రూమ్ నుండి సత్సంగ హాలు దగ్గరే, కానీ పైకి ఎక్కాలి. 29వ తేదీ శనివారం ఉదయం 10గం॥లకు సత్సంగం ప్రారంభం అవుతుంది. నేను ఉదయం 9 గం॥లకు తయారై రూమ్ బయటకు వచ్చాను. అక్కడ ఒక గురుబంధువు నా కోసమే గురువుగారు పంపినట్లు వచ్చి ఉన్నాడు. అతడు 'ఆంటీ మీరు రెడీయేనా' అని అడిగాడు. రెడీయే బాబు అన్నాను. రండి మిమ్మల్ని కారులో సత్సంగహాలుకు తీసుకుని వెళ్తానని హాలు దగ్గరకు తీసుకుని వెళ్లి దింపాడు. సత్సంగహాలు ప్రక్కనే ఉన్న రూమ్‌లో టిఫిన్ ఏర్పాటు చేసారు. నేను టిఫిన్ తింటున్నపుడు దీప- వాళ్లమ్మ పద్మగారిని పరిచయం చేసింది. నేను టిఫిన్ తింటూ ఇద్దరం బాబాగారి గురించి, గురువుగారి గురించి మాట్లాడుకుంటున్నాము. అప్పుడు పద్మగారితో నా కాళ్ల నొప్పులు గురువుగారే తగ్గించాలని చెపుతుంటే, నాకు గురువుగారు కలలో కన్పించిన విషయం జ్ఞాపకం వచ్చి పద్మగారితో కల గురించి ఇలా చెప్పాను. "గురువుగారు కూర్చొని ఉన్నారు. చుట్టూ పిల్లలు కూర్చొన్నారు. నేను గురువుగారి దగ్గరకు వచ్చాను. గురువుగారూ నాకు చేతులు, కాళ్లు నొప్పులుగా ఉన్నాయి. నాకు ఈ బాధలు తగ్గించండి అని అడిగాను. అప్పుడు అక్కడ టెఫ్లాన్ గిన్నెలో నూనె ఉంది. అడుగున తెల్లగా ఉంది అవి బియ్యమో లేక అన్నమో నాకు తెలియదు. అది వ్రాసుకొమ్మన్నట్లు చూపించారు. నేను ఆ గిన్నెను తీసుకుని వెళ్తుండగా ఎవరో ఒకాయన వచ్చి అందులో నూనె కొద్దిగా తీసుకున్నారు. ఇంతలో నాకు మెలకువ వచ్చింది" అయితే మీరు నూనె మర్ధనా చేసుకోండి అని పద్మగారు చెపుతుంటే, వెంటనే నా మనస్సుకు టెఫ్లాను గిన్నెలో ఉన్నది బియ్యము, అన్నము ఏమీ కాదు ఆరతి కర్పూరము అని అనిపించింది. అంతకుముందు కలవచ్చినపుడు గురుబంధువులకు చెప్పాను కాని గిన్నెలో ఉన్నది బియ్యమో లేక ఏమిటో నాకు తెలియదు. కాని పద్మగారితో మాట్లాడుతున్నపుడు ఆరతి కర్పూరము అని అనిపించింది. ఇంటికి వెళ్లాక నూనెలో ఆరతి కర్పూరము వేసి మర్దన చేసుకోవాలి అని అనుకున్నాను. ఇంతలో ఆరతి మొదలుపెట్టారు. అందరము లోపలికి వెళ్లాము. నాకు కాళ్ల నొప్పులు వచ్చినప్పటి నుండి క్రింద కూర్చోలేకపోతున్నాను. చిన్న స్టూలు మీద కూర్చుంటే బాగుంటుంది. కుర్చీలో కూర్చుంటే నేను పొట్టిగా ఉండడం వల్ల కాళ్లు అందక నొప్పి వస్తుంది. అందుకే సత్సంగానికి నా ప్లాస్టిక్ స్టూల్ తెచ్చుకుందామని అనుకున్నాను. ఇక్కడి నుండి ఏమి పట్టికెళతాములే, అమ్మా! నీకు అక్కడ ఒక స్టూల్ కొంటాను అని మా అబ్బాయి అన్నాడు. చూడండి, అక్కడ నాకు గురువుగారు స్టూలు అవసరం లేకుండా ఎలా ఏర్పాటు చేసారో, సత్సంగహాలులో ఫైర్ ప్లేస్ ఉంది. దాని చుట్టూ



గుండ్రంగా గట్టు ఉంది. అది అచ్చము నా స్టూలు ఎంత ఎత్తులో ఉంటుందో అంత ఎత్తులో ఉంది. ఆ గట్టుపై కూర్చొంటే ఎదురుగా బాబాగారిది, గురువుగారిది ఫోటో నాకు ఏ అడ్డు లేకుండా ఎంతో బాగా కనబడుతుంది. నేను ఎప్పటినుండో ఆస్టిన్ శ్రీనివాస్‌ను "బాబాగారు ఎంతో ప్రసన్నంగా కూర్చొని నవ్వుతూ అడిగి తీయించుకున్న ఫోటో కావాలని"అడుగుతున్నాను. సత్సంగములో ఉదయం కాఫీ టైములో శ్రీనివాస్‌ను ఫోటో తెప్పించావా బాబూ! అని అడిగాను. ఆంటీ మీ కోసమే అన్నట్లు మొన్న ఫోటోలు వచ్చాయి. అవి తెచ్చాను. అని చెప్పి ఇచ్చాడు. నిజంగా నాకు ఎంతో ఆనందమయ్యింది. ఆ ఆనందమును ఎలా వర్ణించగలను? ఇంటికి వచ్చాక నూనెలో ఆరతి కర్పూరం వేసికొని మర్దన చేసుకుంటున్నాను. నొప్పి కొంచెం తగ్గింది. మునుపటి అంత బాధ లేకుండా ఉంది. నొప్పి వచ్చినపుడల్లా మర్దన చేసుకుంటే బాధ తగ్గింది. గురువుగారికి నేను ఇబ్బంది పడకుండా సత్సంగమునకు వెళ్లి రావాలని వ్రాసుకున్నాను. కాని నాకు గురువుగారు ఎన్నో అనుభవాలు ఇచ్చారు.

**– సీతాంబరము**

## ఇహపర శ్రేయోదాయి...

మా తమ్ముని వివాహం మాకొక సమస్య అయింది. ఎన్నో సంబంధాలు చూసాము. కానీ మా వాడికి నచ్చలేదు. అతనికి నచ్చిన అమ్మాయితో వివాహం చేయాలన్నదే మా అభిమతం. మా అందరి దృష్టిలో మా బంధువుల అమ్మాయి ఉన్నప్పటికి, ఏవైనా అడ్డంకులు వస్తాయోమోనని అడగడానికి సంశయించాము. ఈ విషయం మాకు చాలా చీకాకు కలిగించింది. అక్కడక్కడ సత్సంగ ఫలితాలు నా చెవిన పడడంతో మాఇంట్లో కూడా సత్సంగము జరపాలని నిర్ణయించాము. అనుకున్నట్లుగానే మా ఇంట్లో సత్సంగము జరిగింది. సత్సంగంలో బాబా ఫోటో, గురువుగారి ఫోటో పెట్టి పూజ చేసి బాబా సచ్చరిత్ర నుండి ఒకటి రెండు అధ్యాయాలు చదివి, తరువాత భజన చేసుకున్నాము. సత్సంగము జరిగిన మూడవరోజే మేము అనుకుంటున్న అమ్మాయి తల్లిదండ్రులు మా ఇంటికి వచ్చి వాళ్లమ్మాయిని మా తమ్మునికి ఇచ్చి వివాహం చేయాలని ప్రస్తావించారు. మేము ఏ విషయం కోసం తాపత్రయపడుతున్నామో, ఏ విషయం కోసం ఎదురు చూస్తున్నామో ఆ ప్రతిపాదన వాళ్లనుండే వచ్చేసరికి మా సంతోషానికి అవధులు లేకుండా పోయింది. అడగడానికి సంకోచిస్తున్న మేము సంతోషంగా అంగీకరించాము. గురువుగారి ఆశీస్సుల బలంతో మా తమ్ముని వివాహం అతివైభవంగా జరిగింది.

**– టి. విజయరామయ్య**



# విశ్వాసమే బలం - సాటివారికీ ఫలం

పిలిస్తే పలికే దైవం శ్రీ శిరిడీ సాయినాధులు - తలిస్తే రక్షించే దైవం సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీగారు. ఎన్నో జన్మల పుణ్యఫలంగా మనకొరకు అనంత కరుణామయులు, అపార కృపాసముద్రులయిన శ్రీ శరత్ బాబూజీగారు జన్మించి, కళ్ల ముందు నడయాడుతూ అనుక్షణం మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. మీ భారములను నాపై పడవేయుడు. నేను మోసెదను అన్న శ్రీ సాయినాథుని వాక్కు నిత్యసత్యం. మన భారములను గురువుగారు మోస్తున్నారు. గురువుగారికి మన పగ్గాలప్పగించి నిశ్చింతగా ఉండవచ్చు అన్న అనుభవాలు మాకు ఎన్నింటినో గురువుగారు ప్రసాదించారు. మా అనుభవాలను గురుబంధువులతో పంచుకోవాలన్న భావనతో, 16-8-05న గురువుగారి దర్శనార్థం తిరువణ్ణామలై వచ్చినప్పుడు, గురువుగారి దర్శనం చేసుకొని నా అనుభవాలను గురుబంధువుల కోసం రాస్తున్నాను.

నేను ప్రస్తుతం అనంతపురంలో ఒక ఉద్యోగం చేస్తూ శిరిడీ సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం, ఆదివారం సాయంత్రపు వేళల్లో సత్సంగాలకు వెళ్తూ గురువుగారి అనుగ్రహంతో జీవనం సాగిస్తున్నాము. ఎన్ని జన్మల అనుబంధమో, శ్రీ శిరిడీ సాయినాథుడు నన్ను శిరిడీకి లాక్కెళ్లారు. అప్పుడు నేను బాబాను పూజిస్తూ హిందూపురంలో ఒక చిరు ఉద్యోగం చేసుకుంటూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాణ్ణి. మా ప్రక్క ఇంటిలో ఉన్న ఒక గురుబంధువుతో నా భార్య తన బాధలు చెప్పుకుంది. "గురువుగారికి ఒక ఉత్తరం వ్రాయండి. మీ ఆయనకు మంచి ఉద్యోగం లభిస్తుంది" అంటూ ఆ గురుబంధువు సెలవిచ్చారు. మా ఆవిడకు, నాకు అప్పటివరకు శ్రీ బాబూజీ గురించి ఏమీ తెలియదు. కనీసం ఫోటో కూడా చూడలేదు. అయితే అపారకృపాళువు, దయాసాగరులు, భక్త జన సంరక్షకులు అయిన గురువుగారికి మూడు ఉత్తరాలు రాసుకున్నాను, నాకు మంచి ఉద్యోగాన్ని ప్రసాదించారు. పూనాలో ఒక భక్తుని కోసం బాబా ఉద్యోగం సృష్టించినట్టు నా కోసం ఒక డిపార్టుమెంట్‌నే బాబూజీ తెప్పించారు. కాలం గడుస్తుండగా గురువుగారు నన్ను అనంతపురం బదిలీ చేయించారు. తొలుత బాధపడినా తర్వాత తెలిసింది గురుమహిమ అనంతమని! అంతవరకు గురువుగారి ఫోటో చూడని నేను ఒకరోజు అనంతపురం శిరిడీసాయిబాబా మందిరంలో జరిగే సత్సంగంలో అనుకోని విధంగా పాల్గొన్నాను. శిరిడీ సాయినాధుని ఫోటో ప్రక్కన గురువుగారి ఫోటో చూసాను. అక్కడ జడ్జి చంద్రకుమార్‌గారు సత్సంగంలో శ్రీ శరత్‌బాబూజీగారి మహిమలు తరచుగా  చెబుతుండేవారు. అప్పటికి ఇంకా నా ఉద్యోగం పర్మినెంట్ కాలేదు. జడ్జిగారు-నా సమస్యకు,



సత్సంగానికి సంబంధం ఉందన్నారు. తొలి సత్సంగానికి వెళ్లడంతోనే నా ఉద్యోగం పర్మినెంట్ అయ్యింది. ఇక అప్పటినుండి గురువుగారు అనేక అనుభవాలు ఇచ్చారు. ఒక సందర్భంలో నేను ఆఫీసు సమస్యలతో సతమతమవుతూ సత్సంగానికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాను. నా బాధను జడ్జిగారితో చెప్పలేక ఒక సమస్యతో బాధపడుతున్నానని ఆయనతో చెప్పాను. గురువుగారికి ఉత్తరం రాయండి. మీ సమస్య తీరిపోతుందని జడ్జిగారు చెప్పారు. తొలుత కొంత సందేహించినా గురువుగారి మహత్యం ఎంత గొప్పది కాకపోతే జడ్జిగారు అలా ఎందుకు చెబుతారని రాత్రికిరాత్రే గురువుగారికి ఒక ఉత్తరం వ్రాసాను. మరుసటి రోజే నా సమస్య పరిష్కారం అయ్యింది. ఆశ్చర్యంతో జడ్జిగారింటికి పరుగుతీసి, విషయం చెప్పాను. ఆయన సంతోషపడ్డారు. “ఉత్తరాన్ని పోస్టు చేయకముందే నా సమస్య పరిష్కారమయ్యింది. ఎక్కడికి పోస్టు చేయాలని” జడ్జిగారిని అడిగాను. “నీవు ఉత్తరం వ్రాస్తున్నపుడే నీ సమస్య గురువుగారికి తెలిసిపోతుంది. నీవు ఉత్తరాన్ని పోస్టు చేయడం ఒక రివాజు మాత్రమే” అన్నారు. అప్పటి నుండి గురువుగారికి ఆరు ఉత్తరాలు వ్రాసాను. ఉద్యోగం, ఆరోగ్యం, మానసిక సమస్యల గురించి, ఒక్కొక్కసారి భయాందోళనలతో, క్లిష్ట సమస్యలు ఎదురైనపుడు ఉత్తరాలు వ్రాస్తూ వచ్చాను. అదేమి చిత్రమో! గురువుగారి మహత్యం ఏమని చెప్పను? ఎంతని వర్ణించను? ఒకటి రెండు రోజుల్లోనే నా సమస్యలు పరిష్కారమయి, నాకు మనశ్శాంతి లభించేది. నా సమస్య పరిష్కారం కన్నా, గురువుగారికి భక్తులపైన ఉన్న అపార ప్రేమ, వాత్సల్యం, కరుణ నన్ను అద్భుత రసానుభూతికి గురిచేసి కళ్లలో ఆనందభాష్పాలు కురిపించేవి. ఈ నా అనుభవాలను సత్సంగంలో గురుబంధువులతో పంచుకున్నాను. ఈ అనుభవాలను విన్నవారు కూడా గురువుగారికి ఉత్తరాలు వ్రాసామని, మా సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని చెప్పడం ఆనందం కలిగించింది. ‘నా చర్యలు అగాధములు’ అని బాబా అన్నట్లు గురువుగారి చర్యలు అగాధములు, ఆశ్చర్యకరములు, అద్భుత రసాప్లావితములు. అందుకు ఒక సత్సంగ భక్తురాలికి కలిగిన అనుభవమే నిదర్శనం. బాబా గుడిలో సత్సంగం నుండి నేను బయటకు వస్తున్న సమయంలో ఒక టీచర్, ఆమె పేరు సునీత నావద్దకు వచ్చి “సార్!బాబా నన్ను రక్షిస్తారా?” అని అడిగింది. తప్పకుండా అంటూ, నీ సమస్యను గురువుగారికి ఉత్తరం ద్వారా తెలియచేస్తే పరిష్కారమవుతుందన్నాను. ఆ తరువాత ఆమె గురువుగారికి ఉత్తరం పోస్టు చేయడానికి అడ్రస్ అడిగితే ఇచ్చాను. ఒక నెలరోజులలోగా ఆమె నాకు ఫోన్ చేసి “సార్! గురువుగారికి ఉత్తరం వ్రాసాను. నాకు ఆస్పత్రిలో పరీక్షలు చేసారు. ఒకటిన్నర సంవత్సరం నుండి క్యాన్సర్ ఉందన్న భయంతో బాధపడుతున్నాను.



ఇంకా ఏదో జబ్బు ఉన్నట్లు భయం భయంగా చెప్పింది. నేను "అమ్మా! ఏం భయపడకు, బాబాను, గురువుగారిని తలచుకొంటూ ఉండండి. మీకు ఏ జబ్బు లేదని వైద్య పరీక్షలలో తెలుస్తుంది. శుభవార్త వింటావు. బాబా గురువుగారు అనంత కరుణామయులు. కేవలం భక్త జనోద్ధరణకే కారణజన్ములుగా అవతరించి మనలను అనుక్షణం కాపాడుతున్నారు" అని చెప్పాను. నా నమ్మకం వమ్ము కాలేదు. ఆమెకు సత్సంగ ఫలం లభించింది. మరుసటి రోజు 4 గం॥లకు హైదరాబాద్ నుండి ఫోన్ చేసి "సార్! వైద్య పరీక్షల్లో నాకు క్యాన్సర్ లేదని తేలింది. ఎంతో సంతోషంగా ఉంది. ఒకటిన్నర సంవత్సరం నుండి నేను పడ్డ ఆందోళనను బాబా, గురువుగారు తొలగించారు" అని చెప్పింది. ఆమె ఒక ఉత్తరం రాసిందంతే! మరి గురువుగారు ఆమెకున్న రుగ్మతను తొలగించి అమితానందాన్ని ఇచ్చారు! ఇలాంటి సద్గురువు లభించడం ఎన్ని జన్మల పుణ్యమో కదా! గురువుగారి రూపంలో బాబా మన కళ్ల ముందు కనిపించడం ఎంత మధురానుభూతి. ఈ అనుభవాలను వ్రాస్తున్న ఈ సమయంలో నేను అనంతపురం నుండి తిరువణ్ణామలై ఎలా వచ్చాను? గురువుగారు ఎలా రప్పించుకున్నారు? ఎందుకు నా అనుభవాలను వ్రాయిస్తున్నారు? ఇదంతా ఆ దయామయుడే చేస్తున్నారన్న భావన. ఇది భావన కాదు వాస్తవం. ఇక్కడికి వచ్చిన అనుభవం చెబితే మీరు ఆశ్చర్యానందాలకు గురవుతారు. నేను అనంతపురంలో గత 15 రోజులుగా ఒక సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నాను. నేను నా భార్య అరుణాచలం వెళ్లాలనుకున్నాము. ఉత్తరం రాసాను సమస్య పరిష్కారం కాలేదు. గురువుగారు అంత దూరం రప్పించుకుంటున్నారని బాధగా నా భార్యతో అన్నాను. నా భార్య మీ సమస్య తీరుతుంది. అధైర్య పడకండి అన్నది. ఆశ్చర్యకరంగా మేము తిరువణ్ణామలై బయలుదేరే ముందు నా సమస్య పరిష్కారమయింది. గురువుగారి మహాద్భుత మహత్యం మరోసారి నా కళ్లముందు సాక్షాత్కరించి, ఆనంద పరవశుడిని చేసింది. సంతోషంగా అరుణాచలం వచ్చాము. ఎన్నో జన్మల పుణ్య ఫలితం అరుణాచల దర్శనం. రమణ ఆశ్రమ సందర్శనం. గురుదేవుల దర్శనం కలగడం, ఇదో అద్భుత అనుభవం. గురుబంధువులతో పంచుకోవాలనిపించింది. భక్తజన సంరక్షణార్థమే భువికి దిగిన ఆనందస్వరూపులు, భక్తులు ఏవి కోరినా ప్రసాదించే కల్పతరువు గురుదేవులు. భక్తుల జన్మ జన్మల కర్మలను నశింపచేసి ఇహపర శ్రేయస్సును ప్రసాదించే సద్గురు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీకి మనలాంటి సామాన్యులం ఏం సమర్పించుకోగలం? శ్రద్ధ, సబూరి సమన్వితమయిన హృదయకుసుమాన్ని తప్ప.

**– బి. కృష్ణ**



# 'సత్య' సంకలనాలు

భక్తి, జ్ఞానమిళితమై భగవంతుని అపార కరుణ ఘనీభూతమై, ఆనందదాయకమై, జగత్తుకు మార్గాన్ని, జనులకు మార్గదర్శకత్వాన్ని అందించగల పథం ఏదైనా ఉందంటే అది కేవలం 'సద్గురుపథం' అన్నది నిర్వివాదాంశం. అందునా 'అనన్య ప్రేమ భక్తిః' అంటూ పూజ్యశ్రీ బాబూజీ చూపుతున్న ఆ సమర్థ సద్గురుని శరణాగతి పథం సాయిపథం అనుసరణీయం మాత్రమే కాదు – నిత్యానుస్మరణీయం కూడా. అట్టి సద్గురు తత్వం మన భారతీయ ఆధ్యాత్మిక జీవన స్రవంతిలో ఏ విధంగా రూపాంతరం చెందిందో విశ్లేషించుకునే ప్రయత్నంలో భాగం – ఈ సత్య సంకలనం.

***గురుతత్త్వానికి ఇవిగో గురుతులు***

**"తత్త్వాన్వేషణలో తన్మయమైన మహర్షుల అనుభూతులకు వాగ్రూపమే వేదం"** అంటారు శ్రీ బాబూజీ. తత్త్వాన్వేషణలో తన్మయమైన ఆ మహర్షులు వేద కాలం నుండే ఆయా దేశ కాల పరిస్థితుల ననుసరించి మానవులను జిజ్ఞాసా పూరితులుగా మలచే ప్రయత్నం సాగించారు. తాము నమ్మిన అత్యున్నత జీవన విధానాన్ని ఆచరణతో సాటివారితో పంచుకుంటూ, మానవులలో మహనీయులైనారు. ఆ మహనీయుల అసాధారణ శక్తి సామర్థ్యాలకు, అపారమేధా సంపత్తికి, త్రికరణశుద్ధితో సాగే వారి జీవితాలకు, లోకానికి హితం చేయాలన్న వారి తీవ్రమైన ఆకాంక్షకు బద్ధులయినారు ఎందరో. "ఆ మహాపురుషుల అతీంద్రియ దివ్య దర్శనాలు, దివ్యానుభూతులు అనే పునాది మీదనే భారతీయ ధర్మమనే మహాభవనం సుప్రతిష్ఠితమై మంచు కప్పిన హిమగిరిలా ఎదిగి గగనసీమను తాకింది. ఈ మహాపురుషులు మానవ జీవిత పరమగమ్యం చేరడం చూసి భారతీయులు వారిని 'ఆప్తు'లని, 'మహాత్ము'లని పిలవసాగారు. ఉత్కృష్ట ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వ్యక్తీకరించే వీరి వచనాలే వేదాలుగా పేర్కొనబడ్డాయి" అంటారు స్వామి శారదానంద తన 'రామకృష్ణ లీలా ప్రసంగం'లో. వేదాలకు ఆధారాలైన అట్టి మహాత్ముల జీవితం – ఆ మహాత్ముల సమర్థతను ఇలా వచిస్తారు స్వామి వివేకానంద– **"సత్యం, పవిత్రత, నిస్వార్థం ఈ మూడు గుణాలున్న వ్యక్తిని ముల్లోకాల్లోని ఏ శక్తి ఏ హానీ చేయలేదు. ఈ మూడు సద్గుణాలతో శోభిల్లే వ్యక్తి సమస్త విశ్వాన్ని ఎదుర్కోగల సమర్థుడు".** ఇలాంటి విశిష్ఠ గుణాలతో అవతరించిన శ్రీరామకృష్ణులు, శ్రీ సాయిబాబా, శ్రీ భగవాన్ రమణుల వంటి ఎందరినో సద్గురువులుగా అవగతం చేసుకుని ముందుకు సాగుతున్నారు మానవాళి.

**గురువు, దైవం వేరువేరు అని చూసేవారు భాగవతం మొత్తం కంఠస్థం చేసినా భగవంతుని దర్శించలేరు.**



*గురువా?.... లేక దైవమా?...*

వేద, ఉపనిషత్తుల కాలం నుండి జ్ఞాన ప్రదాయకుడైన గురువును విశేష భక్తి, శ్రద్ధలతో పూజిస్తూ వచ్చారు భారతీయులు. మనో మాలిన్యాన్ని కడిగేసి, జ్ఞాన సముపార్జన పట్ల తృష్ణను, సాటి జీవుల పట్ల సమత్వాన్ని అనుగ్రహించగల్గిన గురువుకు-వారి దక్ష(శ్రద్ధ)కు చిహ్నంగా 'దక్షిణ'ను సమర్పించారు. ఇలా వారి శ్రద్ధాభక్తులు, పెరిగే కొద్దీ, ఆ మహాత్ములలో భగవత్ శక్తి వ్యక్తీకరణను ప్రత్యక్షంగా దర్శించగలిగారు. "రుద్రయత్తే దక్షిణం ముఖం తేనమాం పాహి నిత్యమ్" (భగవాన్! కృపాపూర్ణమైన ముఖంతో మమ్ము సర్వదా రక్షించు) అంటూ భగవంతునికై వారు చేసిన ప్రార్థన ఇలా ఫలించిందని, భగవత్కృప గురుశక్తి రూపంలో మూర్తిమంతమై ఇలా రూపు దాల్చిందని గ్రహించారు. ఏనాడైతే ఇలా 'గురుకృప' పట్ల వారి విశ్వాసం బలపడిందో, ఆక్షణాన గురువును దైవంగా సేవించుకోవడానికి ఆలసించలేదు.

*సాకారమా? అపార కరుణకు ఆకారమా?*

"నిజమైన మహాత్ముని జీవితమూ, వారి ద్వారా జరిగే లోకహిత కార్యమూ కూడా నిత్య సత్యాలే! వాటికి ఆది-అంతము రెండూ ఉండవు" అంటారు పూజ్యశ్రీ బాబూజీ. సనాతనమైన ధర్మాన్ని స్థాపించే క్రమంలో లోకహితమే లక్ష్యంగా సాగే పరిణామ క్రమంలో మూఢంగా మారిన ఆచారాలను, వ్యవహారాలను తూర్పారబడతారు. వెలుగు రేఖగా మారి తూర్పున ఉదయించే ప్రభాత సూర్యుని వలే ప్రకాశిస్తారు ఆ మహాత్ములు. అయితే దుస్తరమైన సద్గురు కార్యం ఇంతటితో ఆగదు. జనుల అజ్ఞానాంధకారాలను పటాపంచలు చేస్తూ, మొదలు తాను వెలుగుబాటలో నడుస్తూ, జగత్కాళ్యాణానికై తన అడుగుజాడలను అనుసరించమని మానవాళికి సూచిస్తారు. ఇలా సాకారమైన సద్గురు స్వరూపం అనంత కరుణాసాగరమై, అనుగ్రహ సామ్రాట్టు శ్రీ సాయినాథునివోలె తన బిడ్డల చేయి పట్టుకొని మరీ గమ్యాన్ని చేర్చి - తానే గమ్యమని తెలియచేస్తారు.

*మౌన వ్యాఖ్యా ప్రకటితం...*

అనంతమైన కరుణారూపమైన సద్గురు స్వరూపులు ఏమి బోధించడం మొదలుపెట్టారు? వారు చేసిన ఏ ప్రసంగాల ద్వారా మానవ జీవితం మార్పు చెందిందని గమనిస్తే ఆశ్రయించిన వారికి 'వాచా' వారు చేసిన బోధను క్రోడీకరించలేమనే చెప్పాలి. కేవలం తమ మౌన వ్యాఖ్య ద్వారా, ఆచరణాత్మకమైన వారి జీవన విధానం ద్వారా, భక్తులకు వారు అందించిన లీలా వినోదాల ద్వారానే సద్గురు సాంప్రదాయం తరతరాలకు అందుతోందనడంలో అతిశయోక్తి లేదు. తన గురువును మౌనంగా చూస్తూ సంవత్సరాల

*గురువు ఒక్కరికే మనకు యోగ్యమైనదేమిటో, అయోగ్యమైన దేమిటో తెలుస్తుంది.*



తరబడి సమయగతి తెలియకుండా గడిపానని సాయి చెప్పడం గమనిస్తే– 'గురు దర్శన వైశిష్ట్యము' అవగతం కాగలదు. **పరిపూర్ణత పొందిన మహాత్ముడు (సద్గురువు) ఏమీ బోధించకపోయినా వారి దర్శనమే ఉపదేశమని, వారి దృష్టి, పలుకు, చరణ సేవనమే ఆశీర్వచనమని శాస్త్ర వాక్యం. సద్గురు స్మృతిని హృదయంలో ప్రతిష్టించుకోవడమే సాధనకు పునాదిగా భావించారు, సద్గురు చరణానురక్తులు. సద్గురువులోని విశిష్ఠ గుణాలను, స్థిత ప్రజ్ఞలక్షణాలను, శరణాగతిని అవలోకించుకుంటూ, తమ జీవిత గమనంలో ఆ గురుచంద్రుని ఉన్నత భావాలను చేతనయినంత ఆర్తి, ఆర్ద్రతలతో తిరిగి తిరిగి మననం చేసుకోవడం ద్వారా సర్వ వాపితమైన గురుతత్త్వాన్ని గ్రహింపులో నిలుపుకుంటూ సద్గురుపథాన్ని దర్శిస్తూ, పయనాన్ని ఆస్వాదిస్తూ, గమ్యం చేరుకునే ప్రయత్నంలో పరిపూర్ణత్వాన్ని సద్గురు అనుగ్రహంతో పొందాలని ప్రయత్నంసాగిస్తున్నారు, శ్రీబాబూజీ వంటి సమర్థుని ఆశ్రయించి.....**

**–గురుకృప**

# దర్శనమే కృతార్థత

నేను నెల్లూరుజిల్లా కోట గ్రామస్థుడను. మా అమ్మాయి ఎన్నోసార్లు బి.ఇడి. ఎంట్రన్స్ పరీక్ష వ్రాసినను ప్రయోజనము లేకపోయింది. ఆమెకు బి.ఇడిలో సీటు రాలేదు. ఆర్థిక ఇబ్బందులు కూడ కలిగాయి. 17.3.96నాడు సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారు తిరుమలలో దర్శనం ఇస్తున్నారని సత్సంగ సభ్యులద్వారా తెలిసింది. వారితోపాటు నేనూ తిరుమల వెళ్లాను. బాబూజీగారిని దర్శించుకుని మా అమ్మాయి బి.ఇడి. ఎంట్రన్స్ గురించి, నా ఆర్థిక పరిస్థితి గురించి చెప్పాను. నేను తిరుమల నుండి వచ్చిన తరువాత మా అమ్మాయి బి.ఇడి. ఎంట్రన్స్ వ్రాసి, పాస్ అయ్యింది. అయితే బద్వేల్‌లో ఎలా చదివించాలా? అని ఆలోచించాను. డొనేషన్ రూ. 5,000/– కట్టడానికి డబ్బులు లేవు. కాని ఎలాంటి ఇబ్బంది లేకుండానే డబ్బు సర్దుబాటు అయ్యింది. మా అమ్మాయిని బద్వేల్‌లో చేర్పించాము. ఎలాంటి ఇబ్బంది లేకుండా మా అమ్మాయి బి.ఇడి. చదువుకున్నది. గురువుగారి ఆశీర్వాదము వలన ఎన్నో సంవత్సరాలుగా రాని సీటు మా అమ్మాయికి వచ్చింది.

**–కె.మునిస్వామినాయుడు**


సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

# వీసాతో భరోసా



1994లో విజయమహల్ గేటు దగ్గర డాక్టర్ నరేంద్ర గారి ఇంట్లో బాబా సత్సంగాలు జరుగుతున్నాయని తెలిసింది. ప్రతి గురువారము అక్కడకు పోవుచున్నాము. అక్కడ గురువుగారు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ గురించి తెలుసుకున్నాము. 1995 జనవరి 1వ తేదీన గురువుగారిని తిరువణ్ణామలైలో దర్శించుకున్నాము. గురువుగారితో మా సమస్య, మా చిన్నబ్బాయి గురించి అన్నీ చెప్పుకున్నాము. అంతా సరిగా ఉంటుందని గురువుగారు ఆశీర్వదించారు. తరువాత 1995 విజయదశమికి శిరిడీ వెళ్లాము. గురువుగారిని, బాబాను దర్శించుకున్నాము. అప్పుడు మా పెద్దబ్బాయి వైజాగ్‌లో ఎం.టెక్. చదువుతున్నాడు. మా అబ్బాయికి పెళ్లి చేయాలనిపించి, మా దూరపు బంధువుల అమ్మాయి ఫొటో ఒకటి తీసుకుని వెళ్లి గురువుగారికి చూపించాము. గురువుగారు మంచిది పెళ్లి జరిపించండి అని అన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం కలలో బాబా కనిపించి అమ్మా చాలా రోజుల నుండి రుక్మిణమ్మ పిలుస్తున్నారు. నేను పోతున్నాను అని చెప్పారు. (రుక్మిణమ్మ – ఆ అమ్మాయి అమ్మ) గోవిందయ్య భార్య రుక్మిణమ్మ అంటే ఎవరు? అని అన్నారు. తరువాత మెలకువ వచ్చింది. ఆ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకోమని బాబా చెప్పారని తలచాము. 1996 మార్చిలో మా పెదబాబుకి ఆ అమ్మాయితో పెళ్లి నిశ్చయమైంది. తరువాత మార్చిలో గురువుగారిని తిరుపతిలో మా కుటుంబసభ్యులందరమూ దర్శనము చేసుకున్నాము. తరువాత నేను "అబ్బాయికి ఉద్యోగం లేకుండా పెళ్లి చేస్తున్నామే?" అని బాధపడ్డాను. అంతకు ముందు మా పెద్దబ్బాయితో, అమెరికా వెళ్లుటకు టోఫెల్ వ్రాయమంటే, ఎందుకులే అమ్మా! అక్కడికి వెళ్లినా 10సం॥ల తరువాత ఇండియా రావాల్సిందే. అప్పుడైనా ఉద్యోగం చేయాలి అని అన్నాడు. ఐఎఎస్‌గాని, ఐపిఎస్‌గాని చదివి సెలెక్ట్ అవుతాను. నాకు నమ్మకం ఉంది అని చెప్పాడు. కొంత కాలానికి ఢిల్లీలో కార్పొరేషన్ ఇంటర్వ్యూకి వెళ్లి వచ్చాడు. అప్పుడు అక్కడి వాళ్లు లోకల్ వాళ్లకే ఉద్యోగాలు ఇవ్వాలని కోర్టులో కేసు వేసారు. ఇంతవరకు తెలియలేదు. అప్పుడు మాకు మా బంధువుల ద్వారా అమెరికా పోవచ్చు. అబ్బాయికి, అమ్మాయికి 7 లక్షల దాకా ఖర్చు అవుతుంది అని తెలిసింది. మా పెద్దబ్బాయికి చెపితే సులభంగా ఒప్పుకున్నాడు. 1996 ఆగస్ట్ 29వ తేదీన మా పెద్దబ్బాయి పెళ్లి జరిగింది. 31వ తేదీ గురువుగారి దర్శనార్థం గురువారం శిరిడీకి వెళ్లారు. గురువుగారు వాళ్లను ఆశీర్వదించారు. అమెరికా సంగతి గురువుగారిని అడిగితే 'వీసా వస్తుంది, అమెరికా వెళతారు' అని అన్నారు. తరువాత మా బాబు త్రివేంద్రంలో కంప్యూటర్ కోర్సు చేసాడు. 1996 విజయదశమికి నేను, మా వారు శిరిడీ వెళ్లి, మరలా గురువుగారిని దర్శించుకున్నాము. 1997 జనవరిలో వీసా వస్తుందన్నారు. కాని మార్చి దాకా రాలేదు. మాకు చాలా బాధ వేసి అన్నీ మీరే చూసుకోండని గురువుగారికి లెటర్ వ్రాసి మా ఇంట్లో పటం క్రింద పెట్టాము. ఇది జరిగిన వారం



రోజులకు వీసా వచ్చింది. డబ్బులు కూడా మేము అనుకున్న దానికంటే లక్ష రూపాయలు తగ్గించారు. తరువాత ఏ ఆటంకమూ లేకుండా మా పెద్దబ్బాయి, కోడలు 1997వ సం॥ మే 1వ తేదీన ఉదయం గం॥2.30 ని॥లకు హైదరాబాద్ నుండి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఇది అంతయూ బాబా అనుగ్రహము, గురువుగారి ఆశీస్సులతో జరిగినది అని మేము ఎల్లప్పుడూ నమ్ముచున్నాము.

–కామేశ్వరి

# శరణన్న భక్తి

**ప్రధమ సందర్శనం-వికసించిన మనః కుసుమం**


భగవాన్ కూర్చునేహాలుకు వెలుపల పశ్చిమ భాగంలో కూర్చున్న మా పెత్తండ్రి కొమార్తె సుబ్బమ్మగారు హఠాత్తుగా రమణ సన్నిధిన నన్ను చూసి విస్తుబోయింది. విషయం విచారించి తెలుసుకునే లోపల భగవాన్ కొండదిగి వచ్చి హాలులో ఆసీనులైనారు. అందరి నమస్కారాలు అయిన వెనుక ఆమె హాల్లోకి వెడుతూ నన్నూ రమ్మన్నది. నా చేతిలో పళ్లూ వగైరా ఏమీ లేవు. పెట్టెలోనూ, బుట్టలోనూ ఏమీ లేవు. మనస్సులో మాత్రం ఏమున్నది? ఏమీ లేదు. అంతకుముందే మానస శతకంలో ఒక పద్యం వ్రాసుకున్నాను. ఆ పద్యం ఏమిటంటే...

**తత్త్వమెరిగినట్టి ధన్యుండు ధనవాంచ  దగులడెందు వాని దరికి చేరి**
**భక్తిసేవజేసి పావనం బౌమనః  పుష్పమిచ్చి శరణు బొందుమనస ॥**

ముందు తత్త్వశీలుడైన గురువు లభించాలి. ఆ వెనుక వారి సేవ వల్ల మాలిన్యమంతా కడిగితే గదూ మనఃపుష్పం వికసించడం? అట్లా వికసించిన పుష్పాన్ని అర్పణ చేయాలి. ఈ ఆశయంతో ఉండడం వల్ల ఏమీ తేలేదే అన్న చింత కూడా లేకుండా రిక్తహస్తాలతో, తత్తరబిత్తరలాడే మనస్సుతో హాల్లో ప్రవేశించి, ఆమె వెనుక నేనూ నమస్కరించి, ఆడవాళ్ల స్థలంలో తలవంచుకుని ఒదిగి కూర్చున్నాను. హాలంతా నిశ్శబ్ధంగానూ, ప్రశాంతంగానూ ఉన్నది. పది నిమిషాలు గడిచిన వెనుక తలఎత్తాను. భగవాన్ నా వంక తేటిపాటి చూస్తున్నారు. అతి శీతలమైన ఆ దృష్టి వల్ల నా మనస్తాపం చల్లారినట్లయింది. ఆ తేజోమయ దృగ్జాలాన్ని ఎదుర్కొన లేక వెంటనే నా తల వ్రాలిపోయింది

–నా రమణాశ్రమ జీవితం' సౌజన్యంతో

సద్గురువు మీద విశ్వాసాన్ని పెట్టుకోవడాన్నే అనన్య భక్తి అంటారు.


సర్వ కాలాలలో, సర్వ స్థితులలో, సర్వ దేశాలలో అనుక్షణం సద్గురుని నామాన్ని స్మరిస్తూ ఉండడమే తెలుసు.
మా కన్నుల్లో సద్గురుని దివ్యరూపాన్ని దాచుకోవడమే తెలుసు.
అహర్నిశలూ సద్గురుని మాటకు కట్టుబడి ఉండడమే తెలుసు.
సద్గురుని పవిత్ర పాదాలే మాకు శరణం... రక్షణం...
- సాయి సచ్చరిత్ర
A man's dreams are an index to his greatness


సద్గురు లీలా గానమే మాకు వేద వేదాంతాల అభ్యాసము.
సద్గురు గుణ కీర్తనమే మాకు సద్గ్రంథ పారాయణము.
సద్గురు నామ జపమే మా నిత్య ధ్యానము.
సద్గురు చరణ కమలమే మా లక్ష్యము.